

టిడ్కో గతి మారేనా..?

- మౌలిక వసతులు కరువు - నివాసానికి అనానుకూల వాతావరణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వంలో టిడ్కో పరిస్థితి మారుతుందా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు..

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.



అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

భూవివాదంలో ట్రాక్టర్‌తో తొక్కించి...

దళిత మహిళ హత్య

ప్రజాశక్తి- ఆదోని



గుండమ్మ (ఫైల్)

భూ వివాదంలో దళిత మహిళ గుండమ్మ హత్యకు గురైంది. ఆదోని తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాలు... కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామ పరిధిలో పొలం విషయంలో వివాదం తలెత్తి దళిత మహిళ గుండమ్మ (55)ను ట్రాక్టర్‌తో తొక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు విచారణలో తేలింది. ఘటన బాధ్యులైన రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిల చిన్నమ్మ తిరుపతమ్మకు చెందిన నాలుగు ఎకరాల పొలాన్ని దళిత మహిళ గుండమ్మ కొంతకాలం క్రితం కొనుగోలు చేసింది. ఆ పొలంలో తమ వాటా ఉందంటూ రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కోర్టులో దావావేశారు. కోర్టు పరిధిలో భూ వివాదం ఉంది. శుక్రవారం పొలం దున్నేందుకు రాఘవేందర్ రెడ్డి ,శ్రీధర్ రెడ్డి, మరో నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లారు. ట్రాక్టర్‌తో దున్నడాన్ని అడ్డుకునేందుకు గుండమ్మ అడ్డంగా వెళ్ళింది. అప్పటికే ఇరువురి మధ్య పొలంలో వివాదం జరిగి ఘర్షణకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే గుండమ్మపై ట్రాక్టర్‌ను ఎక్కించడంతో అక్కడికక్కడే మతి చెందింది. ఆమెకు తోడుగా వెళ్లిన పురుషోత్తం రెడ్డి పై కూడా రాఘవేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి అనుచరులు కట్టెలతో దాడి చేసి తీవ్ర గాయాలు చేశారు. ప్రస్తుతం కల్లుబావి వీధికి చెందిన పురుషోత్తం రెడ్డి రక్త గాయాలతో ఆదోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గుండమ్మ మతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. గుండమ్మకు గతంలో భర్త చనిపోయాడు. ఆమెకుమారుడు కిషోర్ ఉన్నాడు.

ఆరుగురిపై కేసు నమోదు:- దళిత మహిళ గుండమ్మ హత్య కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేశామని తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆదోని మండలం నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డితో పాటు మరో నలుగురు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ హత్య నేరం కింద కేసు నమోదు చేశామన్నారు నిందితుల కోసం గాలిస్తున్నామని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన వారిని కఠినంగా శిక్షించాలి: కెవిపిఎస్

దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప డిమాండ్ చేశారు.ఆదోనిలోని ఏరియా ఆసుపత్రిలో గుండమ్మ మృతదేహాన్ని కెవిపిఎస్ బృందం పరిశీలించింది. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కెవిపిఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ గోపాల్, ప్రజా సంఘాల నాయకులు లింగన్న, తిప్పన్న, వీరారెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై సమగ్ర నివేదిక

- సంక్షేమ శాఖలపై సమీక్షించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల హాస్టళ్లలో అవసరమైన మరమ్మతులు, అదనపు గదులు, టాయ్‌లెట్స్‌పై అంచనాలను రూపొందించి వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సంక్షేమ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య, అడ్మిషన్లపై సమీక్షించారు. వలసలు ఉన్న ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లలో ఖాళీలు ఉన్నాయన్నారని, ఆలూరు హాస్టల్‌లో 131 సీట్లు, నందవరం హాస్టల్ లో 223 ఖాళీలు ఉన్నాయన్నారు. అలా కాకుండా అన్ని హాస్టళ్లలో విద్యార్థులు పూర్తిస్థాయిలో చేరే విధంగా అడ్మిషన్లను రేషనలైజ్ చేయాలని కలెక్టర్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. వసతిగృహాలను మూసి వేయకూడదని, వాటిని ఎక్కడికైనా తరలించడమో లేక అద్దె భవనాల్లో నిర్వహించడమో చేయాలని ఆదేశించారు. భవనాలకు అద్దె ఎక్కువ అడుగుతున్న దృష్ట్యా ఈ అంశంపై ఉన్నతాధికారులకు డిఓ లెటర్‌ను తయారు చేయాలని కలెక్టర్ జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. బి.తాండ్రపాడులో గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహానికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో పని చేస్తున్న 44 మంది డైలీవేజ్ వర్కర్లకు వేతనాల మంజూరుకు, ఆప్కాస్‌లో చేర్చే అంశాలపై లేఖను సిద్ధం చేయాలని ఆదేశించారు. హాస్టళ్లలో ఉన్న పదవ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక తరగతుల నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జెడి రంగలక్ష్మి దేవి, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, మైనారిటీ సంక్షేమ అధికారి సునీల్ ఖన్నా, ఇడి బిసి కార్పొరేషన్ జాకీర్, ఇడి మైనారిటీ కార్పొరేషన్ సబిహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

- టౌన్ మోడల్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

టెన్త్‌లో విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెంచాలని కలెక్టర్ పి.రంజిత్‌బాష ఉపాధ్యాయులను ఆదేశించారు. నగరంలోని టౌన్ మోడల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు తయారుచేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం టెన్త్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరం మాత్రం తప్పనిసరిగా 100శాతం ఉత్తీర్ణత శాతం ప్రతి పాఠశాలలో నమోదు కావాలని ఆదేశించారు. అవసరమైతే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కోరారు. డిఇఒ కె.శామ్యూల్, అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్‌పాల్, కర్నూలు డిప్యూటీ డిఇఒ హనుమంతరావు ఎంఇఒలు తదితరులు ఉన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

తొలగిన అవరోధం.. వెడల్పుకు మోక్షం...

- మంత్రి టిజి.భరత్ చొరవతో బుధవారపేట మలుపు వద్ద వెడల్పుకు చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మలుపును పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్ తేజ

నగరంలోని 209వ సర్వే నెంబర్ రహదారి పరిధిలో బుధవారపేట మెడికల్ కాలేజీ గేటు వద్ద మలుపు, దాదాపు దశాబ్ద కాలంగా ప్రమాదకరంగా మారిన సంగతి తెలిసిందే. వాహనదారులకు ట్రాఫిక్‌తో ఇబ్బంది కలగడంతో పాటు పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ విషయమై ఇటీవల నగరపాలక అధికారుల సమీక్షలో వెడల్పుకు చర్యలు తీసుకోవాలని మంత్రి టిజి. భరత్ ఆదేశించారు. దీంతో శుక్రవారం నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ మలుపును పరిశీలించి, షాపుల యజమానులతో మాట్లాడారు. రహదారి మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులు ఉండగా, అక్కడ 100 ఆడుగుల రహదారి మాత్రమే ఉన్నట్లు కమిషనర్ గుర్తించారు. మలుపు వెడల్పుకు అవసరమైన 7 షాపులను తొలగించి, వారికి తగిన ప్రత్యామ్నాయ మార్గాలు చూపి న్యాయం చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఆర్అండ్‌బి, రెవెన్యూ, నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు సమన్వయంతో మలుపు వెడల్పుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. డిసిపి సంధ్యారాణి, ఎసిపి రంగస్వామి పాల్గొన్నారు.

పందిపాడు ప్రభుత్వ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఇంటి నిర్మాణానికి రూ 5 లక్షలు మంజూరు చేయాలి : సిపిఎం డిమాండ్



సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : పందిపాడు ప్రభుత్వ కాలనీలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పందిపాడు ప్రభుత్వ కాలనీలోని ఇళ్లను సిపిఎం ప్రతినిధి బృందం సందర్శించింది. సిపిఎం నగర కార్యదర్శి టి. రాముడు నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ .సాయిబాబా, కె .సుధాకరప్ప, కె ప్రభాకర్ నాయకులు మాట్లాడుతూ 2009లో అప్పటి సిపిఎం ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతుల ద్వారా స్థలాన్ని కొనుగోలు చేయించి కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఇల్లు లేని పేదలు 2500 మందికి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో స్థలాలు కేటాయించారని ఆన్నారు. 2009 తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి, కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాలు ప్రభుత్వ కాలనీ పేర్లు మార్చారు తప్ప అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. పేదలకు ఇచ్చిన స్థలాల్లో 15 యేళ్లు అవుతున్నా కేవలం 25 కుటుంబాలు మాత్రం పూర్తిగా తమ సొంత డబ్బులతో ఇల్లు నిర్మించుకున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే గౌరు చరిత ఈ కాలనీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని గౌరుచరితను కోరారు. ప్రజలు ఇల్లు నిర్మించుకోవాలంటే కనీసం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీ మొత్తం బురదమయం అయిపోతుందని, నడవడానికి కూడా వీలు లేని విధంగా రోడ్లు ఉన్నాయన్నారు. కనీసం మెటల్ రోడ్లు అయినా నిర్మించాలని డిమాండ్ చేశారు. స్పందించకుటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నగర నాయకులు ఎస్. మహమ్మద్ రఫీ, ఎస్. హుస్సేబాష, ఎం.బాస్కర్ ,బి.మనోహర్. జె.శ్రీనివాసులు. ఎ.గోవిందు, రాము, విజయ్ కుమార్, నగేష్, బాలు, రాములమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ , వేదికపై కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్, శ్రీలత

బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్ షాప్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌లో బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్‌షాప్ పారామెడికల్ విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి , గుండె వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ లో బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్ షాప్ పారామెడికల్ విద్యార్థులు, కర్నూలు మెడికల్ కాలేజ్ విద్యార్థులకు ఇసిజి , కార్డియాలజీ , క్యాథల్యాబ్, అనస్తీసియా టెక్నీషన్లకు రోగులకు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అడ్వాన్స్ లైఫ్ సేవింగ్ ప్రొసీజర్ చాలా ముఖ్యమైనదన్నారు. ఇది ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించాలని అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో రెండు రోజులపాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులతో అడ్వాన్స్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. డాక్టర్ అశోక్ 90 వేల మంది డాక్టర్స్ , టెక్నీషియన్లకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా విజయవాడ నుంచి వచ్చిన డాక్టర్ అశోక్ 25 సంవత్సరాలు నుంచి బేసిక్ లైఫ్ సపోర్ట్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య విద్యార్థుల హార్ట్ ఫౌండేషన్‌లో 50 మంది వైద్య విద్యార్థులలో కార్డియాలజీ, అనస్తీసియా టెక్నీషియన్స్ ,స్టాఫ్ నర్సులకు హార్ట్ ఫౌండేషన్‌లో అడ్వాన్స్ బేసిక్ లైఫ్ సపోర్ట్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్. వై అశోక్ ఎండి సీనియర్, అనస్థీషియాలజిస్ట్ ,క్వాలిఫైడ్ ఇన్‌స్ట్రక్టర్, విజయవాడ. అనస్తీసియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.శ్రీలత ,వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మచ్చుమర్రి గ్రామంలో ఈనెల 7న ఆదివారం ఆడుకోవడానికి బయటకు వెళ్లిన ఐదో తరగతి చదువుతున్న వాసంతిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శిక్షించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె.బలరాం డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలిక వసంతిని అత్యాచారం చేసి హత్య చేసిన ముగ్గురిని ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోం మంత్రి బాధిత కుటుంబాని పరామర్శించి రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేయాలని , కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డేవిడ్, పద్మా నంద యోగి , శ్రీరాములు, చంద్ర శేఖర్, శివ కుమార్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

విద్యుత్ తీగలను చుట్టుముట్టిన చెట్లకొమ్మలు-స్పందించని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జాతీయ రహదారి పక్కన లోకాయుక్త కార్యాలయం సమీపంలోని సంతోష్ నగర్‌లో చిన్న గాలివాన వచ్చినా విద్యుత్ సరఫరా నిలిచిపోయి విద్యుత్ కోసం గంటల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ తీగలను చెట్ల కొమ్మలు చుట్టుముట్టి ప్రమాదకరంగా మారినా విద్యుత్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, వార్డు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎండి యూనుస్, ఎస్ అన్వర్‌బాష ప్రశ్నించారు.ప్రమాదకరంగా మారిన చెట్ల గురించి అశోక్ లీలాండ్ సంస్థలకు సంబంధిత అధికారులపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. గాలి, వాన వచ్చినప్పుడల్లా విద్యుత్ సరఫరా నిలిచిపోయి గంటల తరబడి ఎదురు చూసి వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. శుక్రవారం సంతోష్ నగర్‌లో స్థానికులను కలిసి పర్యటించిన అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ తీగలకు దూరంగా ఉన్నప్పటికీ అవసరానికి మించి చెట్లను నరికి వేస్తున్న విద్యుత్ అధికారులు విద్యుత్ తీగలను చుట్టుముట్టి చిన్న గాలివాన వచ్చినా విద్యుత్ నిలిచిపోయి వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నా స్పందించకపోవడం విచిత్రంగా ఉందన్నారు. విద్యుత్ అంతరాయం కలిగినప్పుడల్లా గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని అఖిల్ రెడ్డి, రిటైర్డ్ అధికారి సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా.. అర్జీలు ఇచ్చినా స్పందించడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను



చుట్టుముట్టడంతోపాటు రోడ్డుపై వెళ్లే ప్రజలకు తగులుతూ ప్రమాదకరంగా మారినా... అశోక్ లీల్యాండ్ షోరూం వారు పట్టించుకోవడంలేదని విమర్శించారు. చెట్లు పెంచడం వ్యవస్థకు ఎంతో అవసరమంటూ..ప్రమాదకరంగా మారిన చెట్లను మాత్రం తొలగించక తప్పదని అన్నారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ తీగలను చుట్టుముట్టిన కొమ్మలను తొలగించాలని కోరారు. ఈ పర్యటనలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు కె.శ్రీనివాసులు, ఎల్. నయుం, ప్రభాకర్ రెడ్డి, ఉజేర్ అహ్మద్, స్థానికులు అన్వర్ బాష, మహమ్మద్ యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన చికిత్స

రోగిప్రాణాలను కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గుండె పోటుతో పాటు చిన్న ప్రేగులోని రక్తనాళాలలో రక్తం గడ్డకట్టిన (మెసెంటెరిక్ ఎంబోలిజం) కొండారెడ్డి అనే వ్యక్తికి చికిత్స అందించి కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు ప్రాణాలను కాపాడారు. నర్సారావు పేటకు చెందిన కొండారెడ్డి వాంతులతో బాధపడుతూ ఉన్నాడు, వాంతులతో ఉపశమనం పొందిన అతను తిన్న తర్వాత కడుపు నొప్పి బాధతో హాస్పిటల్‌కువచ్చాడు. కొండారెడ్డికి గతంలో గుండెపోటు రావడంతో గుండెలో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించారు. ఈ గడ్డకట్టడం వలన రక్తనాళాల పేగులో అడ్డంకులు ఏర్పడి, మరిన్ని సమస్యలకు దారితీసింది. విజయవాడ , హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను సంప్రదించిన సమస్యకు సరైన చికిత్స అందించలేకపోయారు. చివరి ప్రయత్నంగా కర్నూలు మెడికవర్ హాస్పిటల్స్ లోని కన్సల్టెంట్ జనరల్, లాపరోస్కోపిక్ సర్జన్ అయిన డాక్టర్ భార్గవ వ్యాస్ ఏయాన్ సంప్రదించారు. డాక్టర్ పరీక్షలు నిర్వహించి అందులో అతనికి చిన్న ప్రేగులలో తిన్నది అడ్డుపడటం వల్ల అతని చిన్న ప్రేగు సరిగ్గా ఖాళీ కావడం లేదని వారు కనుగొన్నారు. డాక్టర్ భార్గవ్ వ్యాస్ వారి బృందం లాపరోటమీ నిర్వహించి , రక్త ప్రసరణ తగ్గిన చిన్న ప్రేగుకు సరిపడే రక్తప్రసరణ అవ్వట్లేదు (ఇస్కీమిక్ స్ట్రిక్చర్) అనే కారణంగా కడుపు నొప్పి వస్తున్నది అని కనుకొన్నారు. పాడయిన ప్రేగు భాగాన్ని విజయవంతంగా తొలగించి , ప్రేగు ఆరోగ్యకరమైన భాగాలను తిరిగి సరిచేవారు. శస్త్రచికిత్స అనంతరం కొండారెడ్డి బాగా కోలుకున్నాడు. గుండెపోటు , రక్తం గడ్డకట్టడం కలిగిన రోగులలో కడుపు , ప్రేగు సంబంధిత సమస్యలను సకాలంలో రోగ నిర్ధారణ ఎంతో ముఖ్యమని అన్నారు. సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలను నిర్వహించడంలో జాగ్రత్తగా , సమన్వయంతో కూడిన వైద్య సంరక్షణ ప్రాముఖ్యతను చూపుతుంది. రోగి కోలుకోవడానికి ముందస్తు రోగనిర్ధారణ , సరైన శస్త్రచికిత్స చాలా కీలకం అని అన్నారు.అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఆరుదైన శస్త్ర చికిత్సలు ఎన్నో సర్జరీలు చేసిన అనుభవజ్ఞులైన వైద్యులు మెడికవర్ హాస్పిటల్స్ లో ఉనందుకు ఎంతో సంతోషకరమన్నారు. డాక్టర్ బాజీరావ్ వ్యాస్‌ను , సిబ్బందిని అభినందించారు. 24 / 7 వైద్యులు అందుబాటులో ఉంది చికిత్స అందిస్తూ, సరైన సమయంలో సరైన వైద్యం, అత్యాధునిక సదుపాయాలు , అనుభవజ్ఞులైన డాక్టర్స్ మెడికవర్ హాస్పిటల్స్‌లో ఉండటం వల్లనే కొండారెడ్డి వారిని కాపాడగలిగామని తెలిపారు.



అరుదైన చికిత్స పొందిన కొండారెడ్డితో మహేశ్వర్‌రెడ్డి, వైద్యుడు

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని టెట్ డిఎస్‌సి శిక్షణ ఇస్తున్న ప్రైవేటు కోచింగ్ సెంటర్లు విపరీతంగా డబ్బులు వసూలు చేస్తూ ఎలాంటి వసతులను కల్పించడం లేదని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శి రాఘవేంద్ర, వై.నగేష్ పేర్కొన్నారు. అలాంటి కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుకు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర. నాగేష్, జిల్లా సహాయ కార్యదర్శులు హుస్సేన్ బాష, ప్రకాష్ జిల్లా నాయకులు అబ్దుల్లా, వెంకటేష్ లు ఉన్నారు. నగరంలోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో రూ.14 వేల నుంచి రూ.20వేల వరకు ఫీజులు కట్టి వేలాది మంది జాయిన్ అయినా కనీసం వారికి బాత్రూంలు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. పార్కింగ్ స్థలాలు లేవని, కొంతమంది రేకుల షెడ్లు వేసి అందులోనే క్లాసులు నిర్వహిస్తున్నారన్నారు. మూడు నాలుగు వందల మందికి ఒక్క బాత్రూం ఉండడం ద్వారా మహిళలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభ్యర్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశం కూడా ఉందని, వందలాదిమందితో ఎలాంటి రక్షణ జాగ్రత్తలు లేకుండా ఫైర్ సర్టిఫికెట్లు లేకుండా క్లాస్ నిర్వహిస్తున్న ప్రైవేటు కోచింగ్ సెంటర్ల పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులకు వెళ్లకుండా ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో పని చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



హెల్మెట్ ధారణ తప్పనిసరి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్ : ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస రావు సూచించారు. శుక్రవారం జిల్లా కోర్టు నుంచి హెల్మెట్ ధారణ పై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్కు పోలీసులతో కలిసి ఆయన బైకు ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ రాజ్ విహార్ సెంటర్ వరకు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో గత సంవత్సరంలో 3,700 మంది మరణిస్తే అందులో 3వేల మంది ద్విచక్రవాహనంపై హెల్మెట్ ధరించనందుకే మరణించారని న్యాయమూర్తి తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, డిఎస్‌పి బాబు కిషోర్, ట్రాఫిక్ సిఐ పి.గౌతమి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

అత్యాచార నిందితులకు ఉరి శిక్ష వేయాలి

- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఆస్పరి

నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులకు ఉరి శిక్ష వేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని తెలిపారు. అత్యాచారాలకు పాల్పడిన మరణశిక్ష విధించేలా చట్టం అమలు చేయాలని కోరారు. ఈ కేసుపై సమగ్ర విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, తరుణ్, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు అందించాలని టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉల్లిగయ్య వివిధ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్, తహశీల్దార్, పోలీసు స్టేషన్ ప్రభుత్వ అధికారులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. వర్షాకాలానికి అనుగుణంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. అవినీతిని అంతం చేయాలని, గ్రామాల్లో వీధి బల్బులు, విద్యుత్ స్తంభాలు, సమస్యలుంటే త్వరగా పరిష్కరించాలని కోరారు. డీలర్లు తక్కువ కిలో కూడిన బియ్యం వస్తుందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసు శాఖను కోరారు. కూటమి నాయకులు నరసింహ మూర్తి స్వామి, సతీష్ నాయుడు, చిన్న సిద్దయ్య, లక్ష్మీ గోవిందు, ముకన్న, చిరు, కృష్ణ, వలీ, నాబీ, ఇద్రి, గురు, నాగరాజు, లడ్డు, సల్మాన్ ఖాన్, రమేష్, లింగేష్, భీమా, తాయన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

రాష్ట్రంలో చిన్న పిల్లలకు రక్షణ కరువైంది

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో చిన్న పిల్లలకు రక్షణ కరువైందని, ఘోరాలు జరుగుతున్నాయని ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం చిన్న పిల్లలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో జరిగిన విషాదంతో మానవ సమాజం సిగ్గుతో తలదించుకోవాలని తెలిపారు. నిందితులు 9 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య చేయడం ఘోరమన్నారు. నిందితులు కూడా మైనర్లు కావడం ఒకింత విస్మయానికి గురి చేసిందన్నారు. లోపం తల్లిదండ్రులదా లేక సమాజం తీరుదా అని ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా విచారించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ధోకా, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దేవిశెట్టి పీరేష్, శ్రీనాథ్, మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, రామన్న యాదవ్, హనుమంతు, ఎజాజ్ బాషా, నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్ యాదవ్

హంతకులపై చట్టపరమైన చర్యలు

- ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారధి

ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో శుక్రవారం పొలంలో దారుణ హత్యకు పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. శుక్రవారం ఆదోనిలో ప్రభుత్వాస్పత్రిలో మృతురాలు దళిత గుండమ్మ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై అధికారులకు చాలా సీరియస్ ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఘటనకు కారణమైన వారు ఎంతటివారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటన మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ ఉన్న రాజకీయ నాయకులు దళితులను భూ వివాదాల్లో ఇరికిస్తూ దళితులను వాడుకుంటూ రాజకీయంగా, ఆర్థికంగా బలపడుతున్నారని, ఇకపై ఇలాంటి వాటికి స్వస్తి చెబుతామని హెచ్చరించారు. దళితులు ఇలాంటి రాజకీయ నాయకులకు దూరంగా ఉండి, పిల్లలను బాగా చదివించుకొని గొప్పగా బతకాలని సూచించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం ఉన్నారు.

మొక్కలను సంరక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి

మొక్కలను పెంచి రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని భాష్యం స్కూల్‌లో జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్ని వీలైతే అన్ని మొక్కలు నాటడానికి ప్రయత్నించాలని సూచించారు. నాటిన మొక్క మనకే కాదని, అది చెట్టు అయి, మానై, నీడయు, మహా వృక్షమై ఎందరికో ఉపయోగపడుతుందని తెలిపారు. అవకాశమున్నప్పుడల్లా సమయాన్ని పర్యావరణం కోసం కేటాయించాలన్నారు. భాష్యం విద్యా సంస్థల ప్రిన్సిపల్ సురేంద్ర బాబు, ప్రధానోపాధ్యాయులు సురేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారధిని సన్మానిస్తున్న యాజమాన్యం

ఆశావర్కర్ మృతికి కారకులను సస్పెన్షన్ చేయాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శివలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఆశావర్కర్ మృతికి కారణమైన వారిని సస్పెన్షన్ చేయాలని యూనియన్, సిఐటియు నాయకులు కోరారు. శుక్రవారం ఆశావర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు అర్బన్ హాస్పిటల్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు గ్రామంలో ఆశావర్కర్ తోట రాధకు నాలుగు రోజుల నుంచి జ్వరం ఉన్నప్పటికీ మెడికల్ ఆఫీసర్, ఎఎన్ఎంలు సర్వేకు వెళ్లి రిపోర్ట్ ఇవ్వాలని పని ఒత్తిడి తెచ్చారని తెలిపారు. రాధ మృతి చెందారని, మృతికి కారణమైన డాక్టర్, ఎఎన్ఎంలను సస్పెన్షన్ చేసి మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆశావర్కర్లకు పని పెంచడం, భయపెట్టి శ్రమ దోపిడీ చేయిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు జాబ్ చార్ట్ ఏమిటో చెప్పకుండా మెడికల్ ఆఫీసర్లు వారి ఇష్టానుసారంతో ఆశావర్కర్లకు సెలవులు ఇవ్వకుండా పని చేయించడం వల్ల ఆశావర్కర్లు అనారోగ్యానికి గురై చనిపోతున్నారని తెలిపారు. తోట రాధ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సునీత, రాజేశ్వరి, కవిత, గీతాంజలి, కమ్మ సంతోషమ్మ, జయమ్మ, నరసమ్మ, విశాలాక్షి పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఆశావర్కర్స్, సిఐటియు నాయకులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున

ప్రజాశక్తి - ఆదోని

దాతలు అందించే ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని అర్దగేరి బసవన్న గౌడ్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో దాత నాగరాజు స్వామి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగరాజు స్వామి గత మూడేళ్లుగా పంపిణీ కార్యక్రమం కొనసాగించడం ప్రశంసనీయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు కె.పద్మావతమ్మ, జి.వీరచంద్ర యాదవ్, బి.గీత, ఎం.ప్రమీలమ్మ, ఎస్.శ్రీనివాసులు, సిఆర్‌పి బీచుపల్లి పాల్గొన్నారు.

ఉదయం 11 గంటలైనా

తెరచుకోని సచివాలయం

ప్రజాశక్తి - హాలహర్వి



మండలంలోని చింత కుంట, హర్దగేరి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలు కావస్తున్నా తెరవలేదు. వివిధ పనులపై వస్తున్న రైతులు, ప్రజలు వాటికి తాళం వేయడం చూసి, నిరాశతో వెనుదిరిగారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమలు చేస్తోందని, మరి ఆయా కార్యాలయాలను పనివేళల్లో తెరవకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సచివాలయంలోని సిబ్బంది సమయానికి హాజరు కారని, సరిగా విధులు నిర్వహించరని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనిపై పంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా... సచివాలయంలో తమ సిబ్బంది లేరని తెలిపారు. వారు విధులపై బయటకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. సచివాలయంలో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఈ కేంద్రానికి అన్ని శాఖల అధికారులను నియమించాలని, ఆ గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు కోరుతున్నారు.

ధీరేంద్ర సభా మందిరానికి భూమి పూజ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ధీరేంద్ర తీర్థ సభా మందిరానికి భూమి పూజ చేశారు. శుక్రవారం శ్రీవరదేంద్ర తీర్థుల మధ్యారాధన సందర్భంగా మహారాష్ట్ర రాష్ట్రంలోని పుణెలో బ్రాంచి కార్యాలయం వద్ద పీఠాధిపతులు పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ విశేష పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. అంతకుముందు శ్రీవరదేంద్ర తీర్థ మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. సంస్థాన పూజగా భావించే రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా పీఠాధిపతులు వారికి శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు, ముద్రాధారణతో ఆశీర్వదించారు.



భూమి పూజ చేస్తున్న పీఠాధిపతులు

NAME CHANGE

I, YEMMIGANUR SREEDEVI (Old Name) R/o.H.No:87-629-1, Madhav Nagar, Near Amma Hospital, Kurnool dist, AP -518002 .have changed my name as YEMMIGANUR SRIDEVI (New Name) W/O YEMMIGANUR NAGARAJU

బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో

‘ఆదర్శ గ్రామం-అపరాలు’

- నూతన రకం కంది విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ‘ఆదర్శ గ్రామం- అపరాలు’ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పిఆర్‌జి-176 రకం కంది విత్తనాలను పంపిణీ చేశారు. బనవాసి కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ... కంది పంటను వర్షాధారం కింద జులై చివరి వరకు విత్తుకోవచ్చని తెలిపారు. ఈ నూతన రకం విత్తనాలు మధ్య కాలకం కాబట్టి వర్షాధార పరిస్థితుల్లో పంట చివరలో వచ్చే బెట్ట పరిస్థితులను తట్టుకోవచ్చని సూచించారు. ఎకరాకు 4 కిలోల విత్తనం సరిపోతుందని, విత్తే వరుసల మధ్య దూరం 90 సెంటీమీటర్లు, వరుసలో మొక్కల మధ్య దూరం 20 నుంచి 30 సెంటీమీటర్లు ఉండాలని తెలిపారు. ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత మాట్లాడుతూ... ఈ పంట మొలకెత్తినప్పటి నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు సమయానుకూలంగా పాటించాలని తెలిపారు. సరైన సస్యరక్షణ చర్యల ద్వారా అధిక దిగుబడులు సాధించి నికర ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. టిడిపి కన్వీనర్ నజీర్ సాహెబ్, నాయకులు బేతాళబడేసా, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, కెవికె శాస్త్రవేత్త నిరంజన్, ఎఇఒ శ్రీహరి, విఎఎ మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.



కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్. నెం.1009/2022

కెనరా బ్యాంక్ రిప్రెసెంటెడ్ బై ఇట్స్ మేనేజర్
ఎస్.యం.ఇ బ్రాంచ్, కర్నూలు. ...వాది

-ఎదురి-

పి.మహేష్. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

పి.మహేష్ తండ్రి జమ్మన్న, ఇంటి.నెం.77-540,
ముజఫర్ నగర్, కల్లూరు మండలం,
కర్నూలు -518003.

పై నెంబర్ దావా లోవాది ప్రతివాది అయిన మీ నుండి రావలసిన అప్పును రూ. 1,85,195/-ను తిరిగి రాబట్టుకొనుటకు వాది మీపై పై కోర్టులో దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణ ఉన్న14-8-2024వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 14-8-2024

మాలిక్ బాషా షేక్,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్. నెం.872/2022

కెనరా బ్యాంక్ రిప్రెసెంటెడ్ బై ఇట్స్ మేనేజర్. ...వాది

-ఎదురి-

ఎం.శ్రీనివాసరెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

ఎం.శ్రీనివాసరెడ్డి తండ్రి ఎం. మాణిక్యం
రెడ్డి,ఇంటి.నెం.1-6, వర్కూర్ గ్రామం,
కోడుమూరు, కర్నూలు జిల్లా.

పై నెంబర్ దావా లోవాది ప్రతివాది అయిన మీ నుండి రావలసిన అప్పును రూ.3,52,670/-ను తిరిగి రాబట్టుకొనుటకు వాది మీపై పై కోర్టులో దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణ ఉన్న 16-7-2024వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా:16-7-2024

మాలిక్ బాషా షేక్,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్. నెం.1215/2021

కెనరా బ్యాంక్ రిప్రెసెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, ఎస్.
ఎం.ఇ బ్రాంచ్, కర్నూలు. ...వాది

- ఎదురి -

గ్లోరీ సోఫా డిసైనింగ్ వర్క్స్ రిప్రెసెంటెడ్.బై ఇట్స్
ప్రోప్రీటర్ జోయెల్ అలియాస్ ఇస్లావత్ అలియా
ఇస్లావత్ సమీనాయక్ మరియు ఒకరు. ...ప్రతివాదులు

మొదటి, రెండవ ప్రతివాదులకు దావా సమన్లు

1. గ్లోరీ సోఫా డిసైనింగ్ వర్క్స్ రిప్రెసెంటెడ్.బై ఇట్స్
ప్రోప్రీటర్ జోయెల్ అలియాస్ ఇస్లావత్ అలియా
ఇస్లావత్ సమీనాయక్ తండ్రి ఇస్లావత్ పొట్కా నాయక్,
షాప్ నెం.1,చాణిక్యపురి కాలనీ, నంద్యాల రోడ్డు,
కర్నూలు.
2. విజయచంద్ర డోలా తండ్రి చంద్రపాల్ డోలా,
ఇంటి. నెం.87/1096/100, గణేష్ నగర్ కర్నూలు.
...ప్రతివాదులు

పై నెంబర్ దావా లోవాది ప్రతివాదుల అయిన మీ నుండి రావలసిన అప్పును రూ.8,27,027/-ను తిరిగి రాబట్టుకొనుటకు వాది మీపై పై కోర్టులో దావా దాఖలు చేసినారు. ఇందులో మొదటి, రెండవ ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణ ఉన్న08-8-2024వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :- 08-8-2024

మాలిక్ బాషా షేక్,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

- టిడిపి నియోజకవర్గ నాయకులు రాఘువేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



తల్లికి వందనం పథకంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు ప్రసారం అవుతున్నాయని, వాటిని ప్రజలు నమ్మొద్దని టిడిపి నియోజకవర్గ నాయకులు ఎన్.రాఘువేంద్ర రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం సంక్షేమ పథకంపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదని తెలిపారు. ఈ పథకం కింద ఏడాదికి రూ.15 వేలు పొందేందుకు మార్గదర్శకాలు ‘ఇవే’ అంటూ సోషల్ మీడియాలో రావడం అబద్ధమని తెలిపారు. ఈ పథకంపై ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదని పాఠశాల విద్యాశాఖ ప్రకటించిందని తెలిపారు. ఈ పథకం విధివిధానాలు ప్రభుత్వం రూపొందించిన తర్వాత విడుదల చేస్తామని చెప్పారు. అప్పటి వరకూ ఎలాంటి అవాస్తవాలూ నమ్మొద్దని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన రామదాసు గౌడ్

- రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎంపికకు సుముఖం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామదాసు గౌడ్ శుక్రవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి గురించి లోకేష్‌తో చర్చించినట్లు తెలిపారు. అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఎన్నికల్లో టిడిపి అభివృద్ధికి, బలోపేతం చేసినందుకు ఆయన సేవలకు గుర్తింపుగా టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి జిల్లా పార్లమెంటరీ కార్యదర్శిగా నియమించడంతో ఆ పదవిలో కొనసాగుతున్నారు.



లోకేష్‌ను కలిసిన రామదాసు గౌడ్

ఉపాధి బిల్లులు విడుదల చేయాలి

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కైరుప్పల గ్రామ సచివాలయం ఎదుట వ్యకాస ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 10 వారాల ఉపాధి బిల్లులను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వలసలు నివారించేందుకు ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసినప్పటికీ వలసలు నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. ఉపాధి పనులు కల్పించి, జాబ్ కార్డు లేనివారికి కొత్త జాబ్‌కార్డు మంజూరు చేయాలని, ఒక జాబ్ కార్డుకు 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్ ఉపాధి బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య, డ్రెయినేజీ కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని పేర్కొన్నారు. లేకపోతే ఉపాధి కూలీలతో కలిసి ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. వ్యకాస మండల కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు నరసింహులు, కాశన్న, వీరేష్, శివ, లక్ష్మన్న, రంగన్న, వీరభద్ర, రంగవల్లి పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

ప్రజాశక్తి - ఆదోని

విద్యుదాఘాతానికి గురై గుడిసె దగ్ధమైన సంఘటన ఆదోనిలోని విజయనగర్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు కాంతారావు మాట్లాడుతూ... విద్యుదాఘాతంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయిందన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదన్నారు. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని కుంకనూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ముంత నాగరాజ్ (24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు నాగరాజు గురువారం రాత్రి 10 గంటల సమయంలో దేవనకొండ క్రాస్ రోడ్డు నుంచి కుంకునూరు గ్రామానికి బయల్దేరారు. కర్నూలు - బళ్లారి రహదారి మధ్యలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య మానస ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు కాలువల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో డ్రెయినేజీ కాలువలు నిర్మించడానికి శుక్రవారం మురుగు కాలువలను ఎంపిడిఒ బరేన్ సాహెబ్, ఇఒఆర్‌డి బాలన్న, ఆర్‌డబ్ల్యుసి ఎఇ మనోహర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిప్పగిరిలో మురుగు కాలువలు సరిగా లేనందున ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగా డ్రెయినేజీ కాలువలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎస్సీ కాలనీలోని ప్రజలకు, స్థానిక బస్టాండ్ దగ్గర ఉన్న కాలనీవాసులకు అవగాహన కల్పించి ఎక్కడ పోయే మురుగు నీరు అక్కడే పోయే మాదిరిగా చేస్తామన్నారు. ఎవరూ అపోహాలు, వదంతులను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్, పోలీసు యశ్వంత్ పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న ఎంపిడిఒ బరేన్ సాహెబ్, అధికారులు

బాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

- టిడిపి నాయకులు మడికాయల రాజు

ప్రజాశక్తి - నందవరం




ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, నెలరోజుల్లోనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించారని టిడిపి నాయకులు కనకవీడు మడికాయల రాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో పథకాన్ని అమలు చేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మొదటి సంతకం డీఎస్సీపై చేశారని చెప్పారు. అలాగే జులై 1న రూ.4 వేలకు పెంచిన పింఛన్ ఇచ్చిన ఘనత బాబుకే దక్కిందన్నారు. ఇల్లు కట్టుకోవాలని ఎంతో మంది ఎదురుచూసినా గత ఐదేళ్లు వైసిపి పాలనలో ఇసుక దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ తెచ్చి నిర్మాణ రంగాన్ని వేగవంతం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కావడంతో ఎన్నో కంపెనీలు రాష్ట్రానికి వస్తాయని, నిరుద్యోగం తగ్గి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. అలాగే ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బీవీ.జయనాగేశ్వర రెడ్డి గెలిచిన నెల రోజుల్లోనే ప్రతి శాఖపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో ఆయా శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టేలా చేశారన్నారు. పూజారి నాగప్ప, రంగన్న ఉన్నారు.

నాకు న్యాయం చేయండి

- బాధితురాలు నరసమ్మ

ప్రజాశక్తి - నందవరం



తమ పొలాన్ని కౌలు చేస్తూ అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని మాచాపురం గ్రామానికి చెందిన కసిరెడ్డి నరసమ్మ కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. తమకు నందవరం గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 112ఎలో 4.12 ఎకరాలు, సర్వే నెంబర్ 113ఎలో 1.99 ఎకరాలు మొత్తం 6.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఈ పొలాన్ని తన భర్త నాన్నమ్మ కసిరెడ్డి మల్లమ్మ నందవరం గ్రామానికి చెందిన కుర్ది వెంకప్ప కుమారుడు గార్లదిన్నె మాదప్ప నుంచి కొనుగోలు చేశారని అన్నారు. 1949వ సంవత్సరం మే 14న డాక్యుమెంట్ నెంబర్ 753/1949లో రిజిస్ట్రేషన్ చేసుకొని సాగులో ఉన్నామని చెప్పారు. సుమారు 30 ఏళ్ల క్రితము తమ పొలాన్ని మాచాపురం గ్రామానికి చెందిన క్రైస్తవ కోటప్ప కుమారులైన మోషన్న, రత్నంకు కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. గత కొన్నేళ్ల క్రితము తమ పొలాలను కౌలుకు చేస్తున్న మోషన్న, రత్నంలు చనిపోయారని చెప్పారు. తర్వాత మోషన్న కుమారుడు సాగర్ విజయ్ రాజు కౌలుకు చేసేవారని తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి సాగర్ విజయ్ రాజు తమకు కౌలు డబ్బులు చెల్లించకపోవడంతో ‘మా పొలం మాకు ఇవ్వండి. మేమే సాగు చేసుకుంటామ’ని చెప్పామని అన్నారు. అతడు ‘ఈ పొలం మాది. మా పేరిట ఉన్నాయ’ని తెలిపారని అన్నారు. అప్పుడు రెవెన్యూ రికార్డులను పరిశీలించగా ఆర్ఒఆర్, అడంగల్ (ఫసలి నెంబర్ 1402)లో మోషన్న, రత్నం పేర్లను చేర్చి ఉన్నారని తెలిపారు. ఆ రికార్డుల ఆధారంగా మోషన్న కుమారుడు సాగర్ విజయ్ రాజుకు డాక్యుమెంట్ నెంబర్ 1914/2021 సర్వేనెంబర్ 112ఎలో 2.04 ఎకరాలు, 113ఎలో 0.98 ఎకరాలు మొత్తం 3.02 సెంట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. 112ఎలె 2.03 ఎకరాలు, 113ఎలో 0.98 సెంట్లు మొత్తం 3.01 భూమిని రత్నం కుమారుడు ఎస్.సుధీర్ కుమార్ పేరున వారసత్వపు భూమిగా అడంగల్‌లో చేర్చుకున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు సివిల్ జడ్జి కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ కూడా వచ్చిందన్నారు. విజయ రాజు, తన తమ్ముడు జయ ప్రభు ఇద్దరూ తమను సివిల్ కేసు వేసి ఆమొఆర్, అడంగల్ రాకుండా రెవెన్యూ కార్యాలయంలో రెడ్ మార్క్ పెట్టించారని తెలిపారు. ‘నీ కథ ముందుంది, నీవు బయట ఎలా తిరుగుతావో చూస్తాం. సివిల్ కేసు విత్ డ్రా చేసుకోకపోతే నీ అంతు చూస్తామ’ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి తన భూమిని తప్పుగా రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించి రిజిస్ట్రేషన్ చేయించుకుని మోసం చేసి, బెదిరిస్తున్న సాగర్ విజయ్ రాజు, సుధీర్ కుమార్, జయ ప్రభుపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.